అబార్షన్లు నియంత్రించాలి : కలెక్టర్ ఇలా త్రిపాఠి

మందులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

చిట్యాల మార్చి 27 : ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలని, అబార్షన్లను నియంత్రించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. చిట్యాలలోని పీహెచ్‌సీని గురువారం రాత్రి ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో మాట్లాడుతూ ప్రసవాల సంఖ్యను పెంచి సాధారణ ప్రసవాలు అయ్యేలా చూడాలన్నారు. ఆసుపత్రి సిబ్బంది, ఓపీ, ఇన్ పేషెంట్లు, మందులు, ఇతర రిజిస్టర్లను ఆమె పరిశీలించారు. వైద్యాధికారి సత్యనరేశ్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో విద్యుత్ సమస్య ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె వెంటనే పరిష్కరిస్తానని చెప్పారు. కలెక్టర్ వెంట డిప్యూటీ తాసీల్దార్ విజయ ఉన్నారు.

అర్హత గల వారు పీఎఫ్‌లో చేరాలి

- జిల్లా పీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి షబీర్ అలీ

సమావేశంలో మాట్లాడుతున్న షబీర్ అలీ

రామగిరి, మార్చి 27: విద్యా సంస్థలతో పాటు ఇతర కార్యాలయాల్లో పనిచేస్తున్న అర్హత ఉన్న ఉద్యోగులంతా పీఎఫ్‌లో చేరాలని జిల్లా పీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎం.షబీర్ అలీ సూచించారు. ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ రీజినల్ కార్యాలయం హైదరాబాద్(బర్కత్‌పుర) ఆధ్వర్యంలో నల్లగొండలోని చర్లపల్లిలోని డీవీఎం కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో గురువారం 'నిధి ఆప్కే నికట్ 2.0' అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షబీర్ అలీ మాట్లాడుతూ ప్రతి సంస్థలో పని చేసే ఉద్యోగులకు పీఎఫ్ విధిగా చెల్లించాలని, ఉద్యోగి ఇచ్చే నెల వేతనంలో 12శాతం ఉద్యోగి, 13శాతం డబ్బులు యాజమాన్యం కలిపి ప్రతి నెలా 15లోగా చెల్లించాలని కోరారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా తరలి వచ్చిన పీఎఫ్ బాధ్యుల ఫిర్యాదులు స్వీకరించి వాటికి పరిష్కారాలు చూపించారు. పీఎఫ్‌కు సంబంధించిన సమస్యలుంటే గతంలో హైదరాబాద్ రావాల్సి ఉండేదని, వాటిని స్థానికంగా పరిష్కరించే దిశగా ప్రతి నెలా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పీఎఫ్ కార్యాలయ సీనియర్ సెక్షన్ సెక్యూరిటీ అసిస్టెంట్ షేక్ నర్సయ్య, డీవీఎం విద్యా సంస్థల కరస్పాండెంట్ దొడ్డ శాంతికుమార్, ప్రిన్సిపాల్ బి.నారాయణరెడ్డి, బొడ్డుపల్లి రామకృష్ణ, ఎన్.శ్రీదేవి, పుష్పాంజలి, చొల్లేటి శ్రీధరాచారి తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ అధిక ధరకు అమ్మితే జైలు తప్పదు

- పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తాసీల్దార్ మాచన రఘునందన్

మాల్, మార్చి 27: రంజాన్, ఉగాది పండుగల సందర్భంగా గ్యాస్ సిలిండర్లు అధిక ధరలకు విక్రయిస్తే జైలు తప్పదని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తాసీల్దార్ మాచన రఘునందన్ హెచ్చరించారు. చింతపల్లి మండల కేంద్రంలోని గ్యాస్ గోదామును గురువారం ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. గ్యాస్ సిలిండర్లను హోటళ్లు, టీస్టాళ్లకు విక్రయిస్తే డెలివరీ బాయ్‌లపై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. సిలిండర్ కొనుగోళు చేసిన వారికి రసీదు తప్పకుండా ఇవ్వాలని సూచించారు. చిట్యాలలో డెలివరీ బాయ్‌లు ఎక్కువ వసూలు చేయడం బహిర్గతం అయిందని, అటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఏజెన్సీలు జాగ్రత వహించాలని తెలిపారు.

ఆదర్శ వృద్ధాశ్రమానికి గేట్ అందజేత

మాల్, మార్చి 27: చింతపల్లిలోని ఆదర్శ వృద్ధాశ్రమానికి నల్లగొండ సుఖినోభవంత్ ఫౌండర్ అండ్ చైర్‌పర్సన్ ఎస్.రత్నప్రభ ఆధ్వర్యంలో గురువారం గేట్‌ను అందజేశారు. గతంలో వెయ్యి లీటర్ల వాటర్ ట్యాంక్, బాత్ రూమ్స్ నిర్మించినట్లు వృద్ధాశ్రమం నిర్వాహకులు తెలిపారు. వారితో పాటు విజయ రెడ్డి, ఇలా సాగరం, మాధవి, లత రూ.15వేల చెక్కును ఆశ్రమానికి అందజేశారు. ఆశ్రమ నిర్వాహకులు ఎస్ఎస్ చారి, ఎస్.భాగ్యలక్ష్మి, కృష్ణమ్మ, లక్ష్మమ్మ, జంగయ్య పాల్గొన్నారు.

'పేదలందరికీ సంక్షేమ పథకాలు వర్తింప చేయాలి'

మిర్యాలగూడ, మార్చి 27: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పేదలందరికీ సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శులు డాక్టర్ మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు డిమాండ్ చేశారు. మిర్యాలగూడ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో గురువారం వారు మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 28న నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. ఆస్తి పన్ను 90శాతం వడ్డీ మాఫీని మరో నెల రోజుల పాటు పొడిగించాలని కోరారు. సీపీఎం నాయకులు అయూబ్, లక్ష్మీనారాయణ, వాడపల్లి రమేశ్, బాషా ఉన్నారు.

రాచకాల్వలో రైతుల శ్రమదానం

శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరు వచ్చే రాచకాల్వలో గుర్రపుడెక్కను తొలగిస్తున్న ఆయకట్టు రైతులు

శాలిగౌరారం, మార్చి 27 : శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరు వచ్చే మార్గంలోని తుర్కపెల్లి హెడ్‌వర్క్ వద్ద పేరుకుపోయిన గుర్రపుడెక్క, చెత్తను గురువారం రామగిరి, జాలోనిగూడెం, తిరుమలరాయినిగూడెం గ్రామాల ఆయకట్టు రైతులు తొలగించారు. రైతు సంఘం మండల ప్రతినిధి చామల వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో రాచకాల్వ వెంట వెళ్లి శ్రమదానం చేసి చెత్తను తొలగించారు. రైతులు పడాల రమేశ్, ఆకుల యాదయ్య, పెంబెల్ల శ్రీను, వాడపల్లి సురేశ్, పడాల రవి, తరాల సైదులు, చీమల శంకర్, నర్సింహ ఉన్నారు.

ఏప్రిల్ 2న 'ఢిల్లీలో బీసీల లొల్లి'ని విజయవంతం చేయాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

నల్లగొండ రూరల్, మార్చి 27: ఏప్రిల్ 2న జరిగే ఢిల్లీలో బీసీల లొల్లి కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో ఆయన రాష్ట్రంలో 8 మంది ఎంపీలు, 8 మంది ఎమ్మెల్యేలను గెలిపించిన ఘనత బీసీలదేనని, దీని దృష్టిలో ఉంచుకొని బీసీల హక్కులను గౌరవించాలని అన్నారు. ఏప్రిల్ 25 వరకు బీసీ బిల్లుకు ఆమోదం తెలపకపోతే బీజేపీపై యుద్ధాన్ని ప్రకటిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం నాయకులు సూర్యనారాయణ, సోమ మల్లయ్య, కాసోజు విశ్వనాథం, నకిరేకంటి కాశయ్య గౌడ్, గోలి విజయ్, గుండా కోటప్ప, సీతారాములు, రాములు, ఆదినారాయణ, శంకర్ గౌడ్, సైదులు, మధు, లింగయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని ధర్నా

తిప్పర్తి, మార్చి26 : అర్హులైన వారందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలతోపాటు కొత్త రేషన్ కార్డులను ప్రభుత్వం అందించాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. తిప్పర్తి తాసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. గత పది రోజులుగా సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై సర్వే నిర్వహించామని, సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి మండల కేంద్రానికి లింక్ రోడ్లు విస్తరించాలని, ఉపాధి హామీ పనులు 200 రోజులకు పెంచి రూ.600 అందించాలని డిమాండ్ చేశారు. నాయకులు నన్నూరి వెంకట్‌రమణారెడ్డి, మన్నె భిక్షం, భీమగాని గణేశ్, గండమల్ల రాములు, చనగోని వెంకన్న, ఆకిటి లింగయ్య, పోకల శశిధర్, జానమ్మ, సైదమ్మ పాల్గొన్నారు.

రంగస్థల కళాకారులకు సన్మానం

రామగిరి, మార్చి 27: ప్రపంచ రంగస్థలం దినోత్సవాన్ని నల్లగొండకు చెందిన సిలువేరు సాహితీ కళా పీఠం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. నల్లగొండలోని ప్రముఖ రంగస్థల కళకారులు కోమలి కళా సమితి వ్యవస్థాపకుడు బక్కా పిచ్చయ్యతోపాటు పౌరాణిక పాత్రల్లో రాణించే కళాకారుడు అద్దంకి లక్ష్మయ్యను వారి నివాసానికి వెళ్లి సన్మానించారు. కళలు, కళాకారులను గౌరవించడం అదృష్టంగా విభావిస్తున్నట్లు సిలువేరు సాహితి కళా పీఠం వ్యవస్థాపకుడు లింగమూర్తి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

హైవేపై డీసీఎం బోల్తా

కేతేపల్లి, మార్చి 27 : మండల పరిధిలోని 65వ జాతీయ రహదారిపై వంటనూనె లోడుతో వెళ్తున్న డీసీఎం వాహనం ప్రమాదవశాత్తు గురువారం తెల్లవారుజామున పల్టీ కొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి ఖమ్మానికి వంటనూనెకు సంబంధించిన ప్యాకెట్లు, డబ్బాలతో బుధవారం రాత్రి డీసీఎం వాహనం బయల్దేరింది. ఇనుపాముల శివారు రాగానే వాహన డ్రైవర్ నసీర్ నిద్ర మత్తులోకి జారుకోవడంతో ఎడమవైపు డివైడర్‌ను ఢీకొట్టి, నూతనంగా నిర్మిస్తున్న సర్వీసు రోడ్డుపై పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాలేదు.

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్ట్

నార్కట్‌పల్లి : మాజీ సర్పంచులను అరెస్టు చేసిన పోలీసులు,

కేతేపల్లి పోలీస్‌స్టేషన్‌లో

దామరచర్ల, మార్చి 27 : పెండింగ్ బిల్లులు చెల్లింపులకు అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా ముందస్తుగా మండలంలోని మాజీ సర్పంచులను వాడపల్లి పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం జాప్యం చేస్తుందని, అడిగేందుకు వెళ్తున్న ప్రతిసారి ఇలా అరెస్ట్‌లు చేయడం సరికాదని మాజీ సర్పంచులు వాపోయారు. అరెస్ట్ అయిన వారిలో వాచ్యాతండా, బొల్లిగుట్టతండా, గణేశ్‌పాడు, బెట్టెతండా, నూనావత్‌తండా, రాళ్లవాగుతండా, ఇర్కిగూడెం మాజీ సర్పంచులు శ్రీనూనాయక్, భాష్యానాయక్, శ్రీను, లింగానాయక్, శేఖర్, సైదూనాయక్, అంకురం నాయక్ ఉన్నారు.

నార్కట్‌పల్లి : అసెంబ్లీ ముట్టడికి బయల్దేరిన చెర్వుగట్టు మాజీ సర్పంచ్ మల్లం బాలకృష్ణ, ఎనుగులదోరి మాజీ సర్పంచ్ మహేశ్వరం సతీశ్‌తోపాటు పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేవని అన్నారు.

కేతేపల్లి : అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న పలువురు మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తీసుకువచ్చారు. అరెస్ట్ అయిన వారిలో కొత్తపేట మాజీ సర్పంచ్ బచ్చు జానకిరాములు, కొండకిందిగూడెం మాజీ సర్పంచ్ గోలి మంజుల భర్త వేణుమాధవరెడ్డి ఉన్నారు.

చందంపేట ఇన్‌చార్జి తాసీల్దార్‌గా గోవర్ధన్‌రెడ్డి

గోవర్ధన్‌రెడ్డి

చందంపేట, మార్చి 27 : చందంపేట ఇన్‌చార్జి తాసీల్దార్‌గా గోవర్ధన్‌రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్క తాసీల్దార్‌గా పని చేసిన శ్రీనివాస్ పెద్దవూర మండలానికి బదిలీ కాగా ఇక్కడ డిప్యూటీ తాసీల్దార్‌గా పని చేస్తున్న గోవర్ధన్‌రెడ్డి ఇన్‌చార్జి తాసీల్దార్‌గా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన తన కార్యాలయంలో గురువారం రేషన్ డీలర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఏప్రిల్ 1 నుంచి సన్న బియ్యం పంపిణీకి ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు గన్నెబోయిన మల్లేశ్ యాదవ్, పచ్చిపాల కృష్ణయ్య, పరమేశ్, భాషానాయక్, అనిల్ పాల్గొన్నారు.

ఈద్గా వద్ద ఏర్పాట్లు పరిశీలన

చందంపేట(దేవరకొండ), మార్చి 27 : రంజాన్ సందర్భంగా నిర్వహించే ప్రత్యేక ప్రార్థనల కోసం దేవరకొండ పట్టణంలోని ఈద్గా ప్రాంగణాన్ని మున్సిపల్ కమిషనర్ సుదర్శన్ గురువారం పరిశీలించారు. మౌలిక సదుపాయాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఈద్గా కమిటీ అధ్యక్షులు సయ్యద్ అజీమొద్దీన్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మహమ్మద్ రహత్‌అలీ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సయ్యద్ దస్తగిరి, ఎండీ ఇలియాస్ పటేల్, ఖదీర్, షబ్బీర్, ఖాజా, ఏఈ రాజు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

అడవిదేవులపల్లి, మార్చి 27: వేసవికాలంలో ప్రజలు దాహార్తికి ఇబ్బందులు పడకుండా గురువారం మండలంలోని బాల్నెపల్లిలో పంచాయతీ కార్యదర్శి సీహెచ్.నాగేశ్వర్‌రావు చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ ఎ.మౌనిక, బిల్ కలెక్టర్ వి.వాసు, మల్టీపర్పస్ వర్కర్లు పాల్గొన్నారు.

నాటు సారా పట్టివేత

కొండమల్లేపల్లి, మార్చి 27 : మండంలోని చింతచెట్టుతండా గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై ఓ వ్యక్తి 5 లీటర్ల నాటు సారాను కొండమల్లేపల్లికి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన

చిట్యాల, మార్చి 27 : మండలంలోని పిట్టంపల్లి, వెల్మినేడు, ఆరెగూడెం గ్రామాల్లో సీసీ రోడ్డు పనులకు వెల్మినేడు పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ బొంతల అంజిరెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ కాటం వెంకటేశం, నాయకులు గుడిపాటి లక్ష్మీనర్సింహ, పిశాటి భీష్మారెడ్డి, ఏదుళ్ల అజిత్‌రెడ్డి, అందె రాములు, నారగోని దుర్గయ్య, కొంపెల్లి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఉపాధి హామీ ప్రజా వేదిక

గుర్రంపోడ్, మార్చి 27: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఉదయం 9 గంటలకు ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.మంజుల తెలిపారు. ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు మండలంలో జరిగిన 390 పనులకు 14వ విడుత సామాజిక తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

కులం పేరుతో దూషించిన ముగ్గురికి ఏడాది జైలు శిక్ష

మిర్యాలగూడ(మాడ్గులపల్లి), మార్చి 27: కులం పేరుతో దూషించి దాడి చేసిన ముగ్గురికి ఏడాది జైలు శిక్షతోపాటు జరిమానా విధిస్తూ నల్లగొండ స్పెషల్ కోర్ట్ ఫర్ ట్రయల్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ కేసెస్ కమ్ సెకండ్ ఏడీజే కోర్టు గురువారం తీర్పునిచ్చింది. మాడ్గులపల్లి మండలం కుక్కడం గ్రామానికి చెందిన నకిరేకంటి శ్రీను, రజిత భార్యాభర్తలిద్దరు 2020లో వారి వ్యవసాయ పొలంలో వరి కోత మిషన్‌తో వరి కోస్తుండగా బట్టు సైదిరెడ్డికి చెందిన పొలంలోకి కోత మిషన్ వెళ్లింది. దాంతో బట్టు సైదిరెడ్డితోపాటు కుమారుడు మహేందర్‌రెడ్డి, భార్య లక్ష్మమ్మ ముగ్గురు కలిసి నకిరేకంటి శ్రీనును కులం పేరుతో దూషించి దాడి చేశారు. దాంతో బాధితులు మాడ్గులపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం నల్లగొండలోని ఎస్సీ, ఎస్టీ కోర్టులో చార్జిషీట్ దాఖలైంది. విచారణ అనంతరం ఒక్కొక్కరికి కులం పేరుతో దూషించినందుకుగానూ ఆరు నెలలు, దాడి చేసినందుకు ఆరు నెలలు మొత్తం ఏడాది జైలు శిక్షతోపాటు ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.1000చొప్పున రూ.3వేల జరిమానా విధిస్తూ జడ్జి రోజారమణి తీర్పునిచ్చారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి : డీఎస్పీ శివరాంరెడ్డి

మాట్లాడుతున్న నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి

కట్టంగూర్, మార్చి 27 : రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో గురువారం కట్టంగూర్‌లో రోడ్డు ప్రమాదాల నివారణపై వాహనదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడుపరాదని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెంట్, కారు డ్రైవర్లు సీటు బెల్ట్ తప్పని సరిగా ధరించాలన్నారు. సీపీఆర్‌పై వైద్య సిబ్బంది డెమో ద్వారా, ప్రమాదాల నివారణకు కళాకారులు పాటల రూపంలో వాహనదారులు, ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆర్ఆర్ఆర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, ఎస్ఐ ఎం.రవీందర్, ఏఎస్ఐ అఫ్జల్, సిబ్బంది సత్యనారాయణ, వెంకన్న, సతీశ్, మల్లేశ్, శంకర్, గౌతమి, అనూష పాల్గొన్నారు.

చండూరులో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి

- తెలంగాణ ఉద్యమకారుడు కళ్లెం సురేందర్‌రెడ్డి

చండూరు, మార్చి 27 : చండూరు రెవెన్యూ డివిజన్ కేంద్రంలో అగ్ని మాపక కేంద్రం ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుడు కళ్లెం సురేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని గురువారం ఒక ప్రకటనలో కోరారు. చండూరు గ్రామీణ, పట్టణ ప్రాంతంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, హోటళ్లు, బహుళ అంతస్తుల భవనాలు ఉన్నాయని, ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు దూర ప్రాంతాల నుంచి అగ్నిమాపక సిబ్బంది రావడం ఆలస్యం జరుగుతుందని పేర్కొన్నారు. చండూరులో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తే చండూరుతో పాటుగా మునుగోడు, నారాయణపురం, గట్టుప్పల్, మర్రిగూడ, నాంపల్లి మండలాల ప్రజలకు మేలు చేకూరుతుందని తెలిపారు.

తైక్వాండోలో సన్‌షైన్ విద్యార్థికి బంగారు పథకం

వెంకట్‌సాయిని అభినందిస్తున్న కోడి వెంకన్న

చండూరు, మార్చి 27 : మున్సిపాలిటీ కేంద్రంలో గురువారం జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి యునైటెడ్ నల్లగొండ డిస్ట్రిక్ట్ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో స్థానిక సన్‌షైన్ పాఠశాలకు చెందిన విద్యార్థి దాచెపల్లి వెంకట్ సాయి అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి రాష్ట్రస్థాయిలో బంగారు పథకం గెలుపొందాడు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కోడి వెంకన్న అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కోడి సుష్మ, ప్రిన్సిపాల్ రవికాంత్, ప్రవీణ్, లతీఫ్‌పాషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరు

- వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు సులోచన

కట్టంగూర్‌లో నిరసన తెలుపుతున్న వీఓఏలు

కట్టంగూర్, మార్చి 27 : కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరని వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు పొడిచేటి సులోచన అన్నారు. వీఓఏల అక్రమ అరెస్టులను నిరసిస్తూ గురువారం మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాపాలన అని చెప్పుకునే రేవంత్‌రెడ్డి సర్కార్ సమస్యలు పరిష్కరించకుండా పోరాటాలను ఆపడం ఏంటని ప్రశ్నించారు. వీఓఏలకు కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించి ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు పెంజర్ల సైదులు, జాల రమేశ్, బండ నాగమణి, కంచర్ల సుజాత, నూనె శోభారాణి, లలిత, శైలజ, సరిత, ఉమ, నందిని, మమత, రేణుక, సాయి పాల్గొన్నారు.

శంకర్‌నాయక్ వైద్య సేవలు అభినందనీయం

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు గీతావాణి, కేస రవి

త్రిపురారం, మార్చి 27 : పీహెచ్‌సీ వైద్యుడు శంకర్‌నాయక్ పేదకు చేసిన వైద్య సేవలు అభినందనీయమని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గీతావాణి, కేస రవి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రమావత్ శంకర్ పీజీ ఉన్నత చదువు కోసం వెళ్తున్న సందర్భంగా గురువారం పీహెచ్‌సీలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా త్రిపురారం పీహెచ్‌సీలో శంకర్‌నాయక్ మెరుగైన సేవలు అందించారని తెలిపారు. అనంతరం శంకర్‌నాయక్ దంపతులను సత్కరించారు. సీహెచ్‌ఓ మాతంగి వెంకటయ్య, సూపర్‌వైజర్లు పట్ట గోపాల్‌రెడ్డి, కమలమ్మ, పెద్దదేవులపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు శిరీష, వెంకన్న, నళినికాంత్‌తోపాటు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

'ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డులు అందజేయాలి'

డిండి, మార్చి 27 : పని చేసే సామర్థ్యం ఉన్న ప్రతి ఒక్కరికీ జాబ్‌కార్డులు అందజేయాలని అడిషనల్ పీడీ నవీన్ ఎంపీడీఓకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు మండలంలోని 38గ్రామ పంచాయతీల్లో సుమారు ఐదుకోట్ల రూపాయలతో జరిగిన ఉపాధి హామీ పనుల గురించి సోషల్ ఆడిట్ బహిరంగ విచారణ జరిగింది. సోషల్ ఆడిట్‌లో 372 అభ్యంతరాలు వెల్లడైనట్లు అడిషనల్ పీడీ తెలిపారు. ఏడు గ్రామ పంచాయతీల్లో పని చేసిన చోట ఫొటోలు తీసి సబ్‌మిట్ చేయలేదని చెప్పారు. ఉపాధి పనులు జరిగే చోట మంచి నీరు, నీడ కోసం టెంట్ లాంటి వసతులుఏర్పాటు చేయలేదని సోషల్ ఆడిట్‌లో తేలిందని అన్నారు. ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల చొప్పున ఫైన్ విధించారు. ఎంపీడీఓ వెంకన్న, ఏపీడీ యామిని, జిల్లా విజిలెన్స్ అధికారి వేణుగోపాల్‌రావు, ఏపీఓ రాజు, ఎస్ఆర్పీలు వెంకన్న, అశోక్ పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీని పకడ్బందీగా చేపట్టాలి

తిరుమలగిరి(సాగర్), మార్చి 27: వచ్చే నెల నుంచి రేషన్‌షాపుల ద్వారా అందించనున్న సన్న బియ్యం పంపిణీని రేషన్ డీలర్లు పకడ్బందీగా నిర్వహించాలని తాసీల్దార్ అనిల్‌కుమార్ అన్నారు. తాసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయన రేషన్ డీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. డీటీ నాగమణి, ఆర్ఐ లక్ష్మీకాంతం, లక్ష్మీనారాయణ, రేషన్ డీలర్లు జటావత్ దత్తు, హన్మ, మధు, నరసింహ, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రంథాలయంలో అన్న ప్రసాద వితరణ

మిర్యాలగూడ టౌన్, మార్చి27 : లయన్స్‌క్లబ్ మిర్యాలగూడ, రైస్‌మిల్లర్స్ సహకారంతో పట్టణంలోని మేరెడ్డి స్మారక గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులకు మధ్యాహ్న అన్నప్రసాద వితరణ చేశారు. అన్నప్రసాద కార్యక్రమానికి పిల్లలమర్రి రమేశ్‌జ్యోతి మ్యారేజ్‌డే సందర్భంగా, పందిరి నర్సయ్య జ్ఞాపకార్థం పందిరి వేణు దాతృత్వం వహించినందుకు వారిని అభినందిస్తున్నామని లయన్స్‌క్లబ్, రైల్ మిల్లర్స్ ప్రతినిధులు తెలిపారు. లయన్స్‌క్లబ్ మిర్యాలగూడ అధ్యక్షుడు యనగండ్ల లింగయ్య, ట్రెజరర్ బీఎం నాయుడు, కేవీన్ ప్రసాద్, సత్యనారాయణ, ముక్కపాటి వెంకటేశ్వర్లు, భాస్కర్, ఏచూరి మురారి, కోల సైదులు, రాంబాబు, క్యామ వెంకటేశం, కర్ర రాంబాబు, ముత్యాల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గోర్ బోలి భాషకు రాజ్యాంగ హోదా కల్పించే తీర్మానంపై హర్షం

సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు

చందంపేట(దేవరకొండ), మార్చి 27 : రాష్ట్ర ప్రభుత్వం గోరు బోలి(లంబాడ) భాషను భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చేందుకు ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపిన సందర్భంగా దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ ఆధ్వర్యంలో లంబాడ ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సన్మానించారు. భాషా పరిరక్షణలో మరో కీలక ముందడుగా ఎమ్మెల్యే బాలునాయక్ పేర్కొన్నారు.

పెండ్లి పేరుతో మోసం చేసిన వ్యక్తి 27 ఏండ్ల జైలు శిక్ష

నల్లగొండ సిటీ, మార్చి 27 : ప్రేమ పెండ్లి పేరుతో దళిత యువతిని గర్భిణి చేసిన యువకుడికి నల్లగొండ జిల్లా కోర్టు గురువారం 27 ఏండ్ల జైలు శిక్ష విధించింది. కనగల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కనగల్ మండలం పర్వతగిరి గ్రామానికి చెందిన నల్లబోతు జగన్ గుర్రంపోడు మండలానికి చెందిన యువతిని పెండ్లి చేసుకుంటానని చెప్పి ప్రేమ వ్యవహారం కొనసాగించాడు. గర్భవతిని చేశాడు. ఆ తర్వాత యువతి పెండ్లి చేసుకొమ్మని అడుగగా చేసుకోకుండా మోసం చేశాడు. దీంతో యువతి గుర్రంపోడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు దర్యాప్తు చేసి ఆధారాలను కోర్టుకు సమర్పించారు. ఈ కేసుపై విచారణ అనంతరం జిల్లా అదనపు సెషన్స్, ఎస్సీ ఎస్టీ కోర్టు విచారణ పూర్తి చేసి యువతిపై అత్యాచారం చేసినందుకు గానూ 10 సంవత్సరాల జైలు శిక్ష, రూ.1000 జరిమానా, దళిత యువతిని మోసం చేసినందుకు గానూ మరో 10 సంవత్సరాల జైలు శిక్ష రూ.1000 జరిమాన.. యువతిని పెండ్లి చేసుకుంటానని మోసం చేసినందుకు మరో 7 సంవత్సరాల జైలు శిక్ష రూ.1000 జరిమా విధిస్తూ న్యాయమూర్తి రోజారమణి తీర్పు ఇచ్చారు. ఈ కేసులో సరైన ఆధారాలు సేకరించి కోర్టులో చార్జిషీట్ సమర్పించిన అప్పటి విచారణ అధికారి ఎస్‌డీపీఓ మహేశ్వర్, ఆనంద్, ఏఎస్ఐ ఖలీల్ అహ్మద్, గుర్రంపోడ్ ప్రస్తుత ఏఎస్పీ మౌనిక, ఎస్‌హెచ్‌ఓ మధు, సబ్‌ఇన్‌స్పెక్టర్ ఇంతియాజ్ అహ్మద్, లైజన్ అధికారులు నరేందర్, మల్లిఖార్జున్‌ను ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అభినందించారు.

ఇబ్రహీంపేటలో ఇఫ్తార్ విందు

హాలియా, మార్చి 27 : హాలియా మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపేటలో గురువారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఆప్కాబ్ చైర్మన్ యడవల్లి విజయేందర్‌రెడ్డి సోదరులు గురువారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి హాజరై ముస్లింలకు పండ్లు, ఖర్జూరాలు తినిపించారు. అనంతరం కోటిరెడ్డి మాట్లాడుతూ ముస్లింల సంక్షేమానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేసిందన్నారు. బీఆర్ఎస్ నాయకులు యడవల్లి మహేందర్‌రెడ్డి, వడ్డె సతీశ్‌రెడ్డి, ఆవుల పురుషోత్తం, ఎక్కలూరి శ్రీనివాస్‌రెడ్డి, అంజత్ ఖాన్, నర్సింహ, చాపల వెంకన్న పాల్గొన్నారు.

అమ్మిరెడ్డి పద్మకు ప్రముఖుల నివాళి

వేములపల్లి : వేములపల్లి మాజీ ఉప సర్పంచ్ అమ్మిరెడ్డి పద్మ మంగళవారం రాత్రి కోదాడ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డి, జూలకంటి రంగారెడ్డి గురువారం గ్రామానికి చేరుకొని మృతదేహం వద్ద నివాళులర్పించారు. అలాగే మండల కేంద్రానికి చెందిన పుట్టల సందీప్ తండ్రి పుట్టల సైదులు ఇటీవల మృతిచెందగా మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డి సైదులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శతాధిక వృద్ధుడు మృతి

మిర్యాలగూడ రూరల్ : మండలంలోని దొండవారిగూడెం గ్రామానికి చెందిన పాశం వెంకట్ రెడ్డి (102) గురువారం మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డి, రైతు బంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.

ఎంజీయూలో అకాడమిక్ రైటింగ్ శిక్షణ కరపత్రాల ఆవిష్కరణ

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, శిక్షణ కన్వీనర్

రామగిరి, మార్చి 27 : నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వాణిజ్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఏప్రిల్‌లో నిర్వహించే 'అకాడమిక్ రైటింగ్' మూడు రోజుల శిక్షణ కరపత్రాలను గురువారం ఎంజీయూలో వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ అల్వాల రవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ రెసిడెన్షియల్ విధానంలో నిర్వహించే శిక్షణను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ కన్వీనర్, ఎంజీయూ వాణిజ్య శాస్త్ర విభాగం అధిపతి ఆకుల రవి మాట్లాడుతూ ఐసీఎస్ఎస్ఆర్ దక్షిణ ప్రాంతీయ కేంద్రం హైదరాబాద్ సహకారంతో ఏప్రిల్ 18 నుంచి 20వరకు మూడు రోజులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా పరిశోధన విద్యార్థులు, యువ అధ్యాపకులు 30మందికి మాత్రమే అవకాశం ఉంటుందని, అర్హులైన వారు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శిక్షణ కో కన్వీనర్ శ్రీదేవి, ఎంజీయూ వాణిజ్య శాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ నీలకంఠం శేఖర్, పీడీఎఫ్ స్కాలర్, ఉమెన్స్ కళాశాల అధ్యాపకుడు కొసనోజు రవిచంద్ర పాల్గొన్నారు.

పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్న వ్యక్తి మృతి

మిర్యాలగూడ, మార్చి 27: మద్యానికి బానిసగా మారిన వ్యక్తి తల్లితో గొడవపడి మద్యం మత్తులో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకోగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. టూటౌన్ సీఐ సోమనర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డకు చెందిన గుంటోజు వసంతరాయుడు, జయమ్మ కుమారుడు గుంటోజు మధుబాబు(42)కు వివాహం కాగా గొడవల కారణంగా భార్య అతడిని వదిలి వెళ్లిపోయింది. మద్యానికి బానిసగా మారిన మధుబాబు ప్రతిరోజూ డబ్బులు ఇవ్వాలని తల్లిని వేధించసాగాడు. కొన్నేళ్లుగా తన కుమారుడి వేదింపులు భరిస్తున్న తల్లి జయమ్మ విసిగిపోయి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మద్యం మత్తులో బుధవారం రాత్రి పోలీస్ స్టేషన్‌కు వచ్చిన మధుబాబు తనపైనే పోలీసులకు ఫిర్యాదు చేస్తావా అంటూ అప్పటికే తనవెంట బాటిల్‌లో తెచ్చుకున్న పెట్రోల్‌ను తన మీద పోసుకొని నిప్పంటించుకున్నాడు. వెంటనే మంటలను ఆర్పివేసి ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతిచెందాడు.

'సాంస్కృతిక సారథిలో కళాకారులకు ఉద్యోగాలు కల్పించాలి'

మునుగోడు, మార్చి27 : కళాకారులకు సాంస్కృతిక సారధిలో ఉద్యోగాలు కల్పించాలని తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం వారు మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల హామీలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ కళాకారులను ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పందరి సైదులు, జిల్లా ఉపాధ్యక్షుడు కోడి భీంప్రసాద్, నియోజకవర్గం అధ్యక్షుడు వనం లింగయ్య, ఉపాధ్యక్షుడు రడం నర్సింగ్ రావు, నాయకులు శివరాత్రి రాములు, గంట నగేశ్, మేడి సైదులు, గోస్కొండ మారయ్య పాల్గొన్నారు.

'కందుల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి'

హాలియా, మార్చి 28 : హాలియా వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి కోరారు. వ్యవసాయ మార్కెట్‌ను గురువారం ఆయన సందర్శించి కందుల కొనుగోలును పరిశీలించారు. మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి, డీసీసీ కార్యదర్శి కాకునూరి నారాయణ, నాయకులు కుందూరు వెంకట్‌రెడ్డి, గౌని రాజారమేశ్, కోట నాగిరెడ్డి, మార్కెట్ సూపర్‌వైజర్ ఖలీల్ తదితరులున్నారు.

31లోగా ప్రైవేట్ డీఈడీ కళాశాలలు అఫ్లియేషన్ రెన్యూవల్ చేసుకోవాలి

రామగిరి, మార్చి 27: ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ డీఈడీ (డీఈఎల్ఈడీ) కళాశాలలు 2025-26 నుంచి 2028-29 విద్యా సంవత్సరానికి ఆయా కళాశాలల ఎన్‌సీటీఈ గుర్తింపును ఈ నెల 31లోగా రెన్యూవల్ చేసుకోవాలని డైట్ ప్రిన్సిపాల్ కానుగుల నర్సింహ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి కళాశాల రూ. లక్ష నేషనల్ బ్యాంక్‌లో డీడీని The chairperson of the Affiliation commitee and the DSE Telangana, Hyderabadకు చెల్లించాలని తెలిపారు. పూర్తి వివరాలకు డైట్ నల్లగొండ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

వ్యక్తి ఆత్మహత్య

మిర్యాలగూడ(మాడ్గులపల్లి), మార్చి 27: ఉరి వేసుకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని గండ్రవానిగూడెంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గండ్రవానిగూడెం గ్రామానికి చెందిన కంచర్ల లచ్చిరెడ్డి(50) కొన్ని నెలలుగా మతిస్థిమితం లేక తిరుగుతుండేవాడు. బుధవారం రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు తమ వ్యవసాయ పొలం వద్ద వెతుకగా పొలం వద్ద ఉన్న వేప చెట్టుకు తన లుంగితో ఉరి వేసుకొని మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.